క్లుప్తంగా

నేడు జాతీయ సదస్సు

గుంతకల్లుటౌన్: విద్యార్థులకు మేథో సంపత్తిపై స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో సోమవారం ఉదయం జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ శర్మ పేర్కొన్నారు. విద్యార్థులను స్వయం ఉపాధి వైపు మళ్లించే ఉద్దేశంతో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు వారు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు



షంషీర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి కోటలో మూడు రోజులుగా జరుగుతున్న సయ్యద్ హజరత్ ఉరుసు ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. జియారత్ సందర్భంగా మన్రో సత్రం వద్ద నుంచి ఉరుసు జరుగుతున్న ప్రాంతం వరకు షంషీర్‌ను ఊరేగించారు. రాత్రికి ఆర్కెస్ట్రా నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'శైలజానాథ్ కోలుకోవాలి'



బాట సుంకులమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్లూరు: వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని కోరుతూ ఆదివారం మండలంలోని బాట సుంకులమ్మ ఆలయం వద్ద ఆ పార్టీ నాయకులు పూజలు నిర్వహించారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆయన అనారోగ్యం నుంచి కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి విష్ణునారాయణ, నాయకులు రామమోహన్, సూరి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్ల ఇష్టారాజ్యం

- అధిక ధరలకు ఎరువుల విక్రయాలు
- పట్టించుకోని వ్యవసాయాధికారులు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దారు రాము (ఫైల్)

యల్లనూరు: రెగ్యులర్ వ్యవసాయాధికారి లేకపోవడంతో ఎరువుల డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎరువులను ఇష్టమొచ్చిన రేట్లకు రైతులకు అంటగడుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 75వేల ఎకరాల భూమి ఉంది. అందులో 25,380 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పత్తి, చీనీ, అరటి, దానిమ్మ తదితర వంటి పంటలు సాగులో ఉన్నాయి. మండలంలో ఎరువులు, యూరియా విక్రయాల్లో దుకాణ యజమానులు అందిన కాడికి దోచుకుంటున్నారు. వ్యవసాయాధికారుల తనిఖీలు లేకపోవడంతో యల్లనూరు, కూచివారిపల్లి, తిమ్మంపల్లి డీలర్లు రైతులకు అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నారు. సొసైటీలో ఒక్కో యూరియా బస్తా రూ.267 నడుస్తోంది. బయట బ్లాక్ మార్కెట్లో ఒక్కో బస్తా రూ.350 వరకూ అమ్ముతున్నారు. ఇదేమని ప్రశ్నించేవారు లేరు. యల్లనూరు, 85–నిట్టూరు, సొసైటికి అరకొరగా యూరియా సరఫరా చేశారు. పెద్దమల్లేపల్లి, చింతకాయమంద, గొడ్డుమర్రి, తిమ్మంపల్లి, బుక్కాపురం, కూచివారిపల్లి తదితర గ్రామాల్లో యూరియా డిమాండు ఉన్నప్పటికీ సరఫరా కాలేదు. దీంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

రైతులకు సలహాలు ఇచ్చే వారేరీ?

మండల వ్యవసాయాధికారి రామకృష్ణ గత జూన్‌లో ఉరవకొండకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి రెగ్యులర్ వ్యవసాయాధికారి లేక రైతులు అవస్థలు పడుతున్నారు. తాడిపత్రి ఏడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఈఓ మధుకుమార్‌కు యల్లనూరు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే ఏఈఓ స్థాయి కావడంతో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేవారు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎరువుల డీలర్లు సమావేశాలు, ఫర్టిలైజర్ షాపుల తనిఖీలు వంటివి ఏఓ స్థాయి అధికారులు చేయాల్సి ఉండటంతో పుట్లూరు వ్యవసాయాధికారిణి కాత్యాయిణికి యల్లనూరు పర్యవేక్షణ అప్పగించారు. మండలవ్యాప్తంగా సుమారు 15కు పైగా ఎరువుల, క్రిమి సంహారక మందుల దుకాణాలు ఉన్నాయి. అయితే పర్యవేక్షణ లేక అస్తవ్యస్తంగా మారింది. మేమింతే మాకు ఇష్టమిచ్చినట్లు అమ్ముకుంటామని డీలర్లు చెలరేగిపోతున్నారు. ఈ సమయంలో వారు ఎంత రేటు చెప్పినా రైతులు తప్పని పరిస్థితుల్లో కొనుగోలు చేయక తప్పదు. ఎరువుల దుకాణాలపై వ్యవసాయాధికారుల, ఏడీఏల పర్యవేక్షణ కరువైంది. డీలర్లపై ఇప్పటి వరకూ ఒక్క కేసు కట్టిన దాఖలాలు లేవు. ఒక షాపు సీజ్ చేసిన దాఖలాలు లేవు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎరువులను అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రహదారుల మరమ్మతులకు మోక్షం

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డు ప్యాచ్ వర్క్‌లు చేయిస్తున్న అధికారులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని గుంతబావి వీధి, సోఫియాస్ట్రీట్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాల్లో పైప్‌లైన్ ఏర్పాటు కోసం తవ్వేసిన రోడ్లపై ప్యాచ్ వర్క్‌లను మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు చేయించారు. 'రహదారులు అస్తవ్యస్తం' శీర్షికన ఈ నెల 13న సాక్షి ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ రోడ్డు మధ్యలో గుంతలు తవ్వేసి వదిలేయడం వల్ల ప్రజలు, వ్యాపారులలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా మరమ్మతులు చేయించారు. పనులను ఎంఈఈ ఇంతియాజ్, ఏఈ సుదర్శన్ పరిశీలించారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యువల్ చేయాలి

గుత్తి/పెద్దవడుగూరు: ఆర్డీటీ సేవలు కొనసాగించాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. గుత్తిలోని ఎస్సీ హాస్టల్లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్సు రెన్యూవల్ చేయాలని సోమవారం అనంతపురంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. అందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అలాగే అనంతపురంలో సోమవారం నిర్వహించే సేవ్ ఆర్డీటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల కొండయ్య కోరారు. ఆదివారం పెద్దవడుగూరులో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రవి, సన్నగిరి, శ్రీరాములు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైన్ షాపులో చోరీ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని గాంధీ నగర్‌లో ఉన్న ఎస్ఎల్‌వీ వైన్ షాపులో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మండల కేంద్రంలోని గాంధీ నగర్‌లో నార్పల రహదారి పక్కన ఉన్న ఎస్ఎల్‌వీ వైన్ షాపులో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం తాళాలు పగలకొట్టి క్యాష్ కౌంటర్‌లో రూ.10 వేలు, మద్యం సీసాలు ఎత్తుకెళ్లారు. నిర్వాహకులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం

గార్లదిన్నె: మండలంలోని సంజీవపురంలో ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాల మేరకు.. నాగమ్మ(55) అనే వృద్ధురాలు శనివారం గార్లదిన్నె ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఊర్లలో వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. ఆమె కుమారుడు అల్లు మోహన్ నాయుడు ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోసం చంద్రబాబు నైజం



రీకాలింగ్ చంద్రబాబు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దపప్పూరు: చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ తాడిపత్రి నియోజకవర్గ పంచాయితీ వింగ్ అధ్యక్షుడు యోగేశ్వరెడ్డి అన్నారు. మండలంలోని ముచ్చుకోటలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాలతో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలోని ఆర్డీటీ కాలనీలో ఇంటింటికి తిరిగి చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ.. ఎన్నికల అనంతరం ప్రజలను ఎలా వంచనకు గురి చేశాడో వివరించారు. అనంతరం క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో నీరు విడుదల చేయాలి



కడదరగుట్టపల్లి రెగ్యులేటర్ వద్ద యాడికి కాలువను పరిశీలిస్తున్న నాయకులు

పెద్దవడుగూరు: తాడిపత్రి నియోజక వర్గంలోని యాడికి కాలువకు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేయాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు వెంకట్రాముడుయాదవ్. తాడిపత్రి నియోజకవర్గ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఓబిరెడ్డి, సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కడదరగుట్టపల్లి వద్ద ఉన్న రెగ్యులేటర్‌ను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ కాలువకు నీరు విడుదల చేస్తే సుమారు 50 వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. పాలకులు స్పందించి రైతులకు సాగునీరు పూర్తి స్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఆదినారాయణ, సీపీఐ మండల నాయకులు పోలా రంగస్వామి, హుసేన్‌పీరా, రంగనాయకులు, సుధాకర్‌గౌడ్, ఆది, రంగారెడ్డి, బద్దెల రామాంజనేయులు, పటాన్ హాజీవలి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బుక్కరాయసముద్రం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు ఆంజనేయులు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో వివేకానంద యోగా గ్రూప్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోజూ యోగా చేయడం ద్వారా రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో వివేకానంద యోగా గ్రూప్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి, ఫౌండర్ నాగభూషణ, యోగా సాధకులు హనుమంతరెడ్డి, జయలక్ష్మి, మారుతీ ప్రసాద్, దివాకర్, సత్యసాయి సంస్థ ప్రతినిధి నరసింహులు, చెన్న కేశవులు పాల్గొన్నారు.

బాబా మదనీ ఉరుసు ప్రారంభం

పామిడి: పామిడిలోని షాదీఖానా ప్రాంగణంలో హజరత్ సయ్యద్ ఖాదర్‌వలి బాబా మదనీ ఉరుసు ఆదివారం ప్రారంభించారు. రాత్రి గంధం ఊరేగింపుతో ఉరుసు మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు ముగుస్తుందన్నారు.

ఆర్థికసాయం అందజేత

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వివేకానంద స్కూల్ ఆవరణలో ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పెట్నికోటకు చెందిన వెంకటలక్ష్మికి రూ.12వేలు ఆర్థిక సాయం అందజేశారు. గత కొంత కాలంగా కాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆమెకు బరోడా బ్యాంక్ మేనేజర్ రాజేష్ చేతుల మీదుగా నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు గురప్ప, ప్రధాన కార్యదర్శి రామేశ్వర రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్, మహిళా కన్వీనర్ విజయ లక్ష్మి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోటను అందరూ సందర్శించాలి

గుత్తి: చరిత్రాత్మకమైన గుత్తి కోటను ప్రతిఒక్కరూ సందర్శించాలని గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, కోట గైడ్ రమేష్ సూచించారు. ఉరవకొండకు చెందిన నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు వెంకట్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులు గుత్తి కోటను సందర్శించారు. కార్యక్రమంలో స్వాతంత్ర సమరయోధుడు సూర్యనారాయణ రెడ్డి, యోగా గురువులు కృష్ణయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన

శింగనమల(నార్పల): నార్పలలోని అయ్యప్ప స్వామి దేవాలయం ప్రధాన అర్చకుడు ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని ప్రఖ్యాత దంత వైద్య శాల నిర్వహించిన ఉచిత దంత వైద్యశిబిరం స్పందన లభించింది. ఈ సందర్భంగా 150 మందికి దంత పరీక్షలు నిర్వహించి మందులు, టూత్ పేస్టులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన..

పామిడి: పట్టణంలోని భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి ఎస్.తిరుపతినాయుడు సారథ్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. బెంగళూరు శంకర ఆస్పత్రి వైద్యుడు సంజయ్ 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 45 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఆ క్లబ్ అధ్యక్షుడు కే రఘువీర్‌రావు, ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు, కోశాధికారి డీ షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఫయాజ్ ట్రస్టు సేవలు అభినందనీయం



కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్‌బాషా తదితరులు

తాడిపత్రిటౌన్: పేదల సేవలో ఫయాజ్‌బాషా సేవాట్రస్ట్ పలువురి మన్ననలు పొందుతోందని వక్తలు అన్నారు. తాడిపత్రి పట్టణంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్‌బాషా నేతృత్వంలో నిర్వహిస్తున్న ఫయాజ్‌బాషా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్త పరీక్షల ల్యాబ్ నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ల్యాబ్‌లో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ డీవీ కుమార్, వక్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్ వలి, రియాజ్, జాఫర్, సబ్బీర్, నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తాడిపత్రిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సత్యసాయి జిల్లా కొడిగెనహళ్లి రెసిడెన్సియల్ పాఠశాలలో 1976–79లో 6 నుంచి 10వ తరగతి చదువుకున్న దాదాపు 60 మంది విద్యార్థులు తాడిపత్రిలోని ప్యారడైజ్‌లో ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాల్లో ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పటి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ప్రదర్శించారు. పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లికి చెందిన వ్యాపారవేత్త శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు కలుసుకుని నాటి మధురస్మృతులు గుర్తు చేసుకున్నారు.

నేషనల్ కరాటే పోటీల్లో ప్రతిభ

తాడిపత్రిటౌన్: నేషనల్ కరాటే పోటీల్లో తాడిపత్రి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని మాస్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం కర్నూలులో నిర్వహించిన 14 కట్ట విభాగం నేషనల్ కరాటే పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 1,600 మంది విధ్యార్థులు పాల్గొన్నారన్నారు. పోటీల్లో తాడిపత్రికి చెందిన ఇంద్రాణి, వెంకటసాయిగౌడ్, అకిల్‌సాయి గోల్డ్‌మెడల్ సాధించారు. కీర్త, ఉదయ్, శ్రీహాన్‌రెడ్డి సిల్వర్ మెడల్ సాధించగా..., సాహితీ, రికిల్‌రాజ్, ప్రజన్య, నీరజ్ క్యాస పథకాలు సాధించనట్లు ఆయన తెలిపారు.

ఇంజినీరింగ్ మేధావి మోక్షగుండం

- నేడు విశ్వేశ్వరయ్య జయంతి
- ఇంజనీర్స్ డే నిర్వహించనున్న కళాశాలలు



జేఎన్‌టీయూ కళాశాల

అనంతపురం /అనంతపురం కల్చరల్: దేశ సమగ్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే ఇంజినీర్లకు మార్గదర్శిగా, భారతజాతి కీర్తి ప్రతిష్టలు సుసంపన్నం చేసిన మహోన్నత వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా మిగిలిపోయాయి. ఏటా సెప్టెంబర్ 15న మోక్షగుండం జయంతి సందర్భంగా ఇంజినీర్స్‌డేను జరుపుకుంటారు.

కరువు సీమలో సాంకేతిక కల్పతరువు..

మోక్షగుండం స్ఫూర్తితో ఆయన అందించిన ప్రేరణతో దేశమంతటా అపురూప కట్టడాలు రూపుదిద్దుకున్నాయి. అనంతలోనూ నాటి ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పట్టే కట్టడాలు ఎన్నో ఉన్నాయి. ఆర్ట్స్ కాలేజీ, జిల్లా కోర్టు ప్రాంగణం, రెవెన్యూ భవనాలు చెక్కుచెదరని, అద్భుత కట్టడాలుగా నిలిచాయి. అందులో అనంత కరువు సీమలో సాంకేతిక కల్పతరువుగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూఏ 1949లో ప్రారంభమైంది. 2008లో వర్సిటీగా ఆవిర్భవించింది. ఏటా 90 వేల మందికి పైగా విద్యార్థులు జేఎన్‌టీయూ పరిధిలో చదువుకుంటూ భావి ఇంజినీర్లుగా వస్తున్నారు. వైఎస్సార్ సీఎం కాకమునుపు నూటికొకరు ఇంజినీర్లు ఉండేవారు. ఇంజినీర్ కావాలన్న ప్రతి ఒక్కరి కల సాకారం చేసిన ఘనత వైఎస్సార్‌దే. ఆయన హయాంలో ఇంజినీరింగ్ కళాశాలలను విరివిగా పెంచారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించి ఎందరినో ఉన్నత విద్యావంతులను చేశారు. ప్రతిభావంతులైన అనంతపురం ఇంజినీర్లు వినూత్న ఆవిష్కరణలతో రాష్ట్రంలోనే తలమానికంగా నిలిచారు. ప్రస్తుత రోజుల్లో కేవలం ఇంజినీరింగ్ మాత్రమే ప్రధాన ఉపాధిగా మారడం వెనుక ఆయన కృషి అపారం.